క్లుప్తంగా

ఆర్‌ఓ ప్లాంటు వితరణ



ఆర్‌ఓ ప్లాంటును ఏర్పాటు చేసిన శ్రీనివాసులు

తంబళ్లపల్లె: స్థానిక ఉన్నత పాఠశాలలో విద్యార్థుల తాగునీటి సౌకర్యార్థం దాత ఆర్‌ఓ ప్లాంటును వితరణగా ఇచ్చారు. మండలంలోని కొటాల పంచాయతీ జరిపేటిదిన్నెకు చెందిన శ్రీనివాసులు రూ.25వేలు విలువ చేసే ఆర్‌ఓ ప్లాంటును వితరణ చేశారు. శ్రీనివాసులునుస్ శివకుమార్,హెచ్‌ఎం శ్రీనివాసులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

పాము కాటుతో వ్యక్తి మృతి



అజయ్‌కుమార్ (ఫైల్)

ములకలచెరువు: పాము కాటు వేయడంతో ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం మండలంలో చోటు చేసుకుంది. స్థానిక మండల కేంద్రం వినాయకనగర్‌లో ఉంటున్న అజయ్ కుమార్ (35) భార్య సునీత స్థానిక టమోటా మార్కెట్‌లోకి పనికి వెళ్లింది. అయితే ఆమెకు అజయ్ భోజనం తీసుకొని వెళ్లాడు. మార్కెట్ యార్డ్‌లో ప్రమాదవశాత్తు పామును తొక్కడంతో కాటు వేసింది. చికిత్స నిమిత్తం మదనపల్లి ఆస్పత్రికి తీసుకొని వెళుతుండగా పరిస్థితి విషమించి మార్గమధ్యంలో చనిపోయాడు. మృతుడికి రేవతి, సంధ్యావాణి, హరిత అనే ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

వైద్యశిబిరం విజయవంతం



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

కేవీపల్లె : మండలంలోని తీతవగుంటపల్లె గ్రామ సచివాలయ ఆవరణలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. ఆదివారం అరబిందో ఫార్మా ఫౌండేషన్ సౌజన్యంతో శ్రీనివాస చారిటుబ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సంజీవిని గ్రామీణ స్త్రీ ఆరోగ్య పరిరక్షణ ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ శశికుమార్‌రెడ్డి మాట్లాడుతూ గర్భాశయ క్యాన్సర్ నివారణే లక్ష్యంగా చేపట్టిన ఈ వైద్యశిబిరంలో 34 మంది మహిళలకు పాప్ స్మియర్ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. అలాగే సాధారణ జబ్బులకు సంబంధించి 108 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ జిలానీ, డాక్టర్ షమీమ్, వలంటీర్లు షబ్బీర్, బాషా, తిరుపతి మెడిగో హాస్పిటల్ వైద్యులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

కంటైనర్, లారీ ఢీ

సురక్షితంగా బయటపడ్డ డ్రైవర్లు



కంటైనర్ ఢీ కొట్టడంతో ధ్వంసమైన లారీ

కురబలకోట: మండలంలోని చెన్నామర్రి వద్ద హైవేపై ఆదివారం ఓ కంటైనర్ మరో లారీ ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో డ్రైవర్లు సురక్షితంగా బయటపడ్డారు. తమిళనాడు తిరుచ్చికి చెందిన లారీ చెన్నామర్రి మిట్ట వద్ద వస్తుండగా ఎదురుగా వచ్చిన మరో కంటైనర్ ఢీ కొట్టింది. దీంతో రెండు వాహనాల ముందు భాగాలు నుజ్జునుజ్జయ్యాయి. ప్రమాదంలో ఎవరికీ ప్రాణ నష్టం జరుగకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు.

నాటుసారా ఊట ధ్వంసం



నీటి బిందెలు, డ్రమ్ముల్లో నిలువ ఉంచిన నాటుసారా ఊటను ధ్వంసం చేస్తున్న ఎస్‌ఐ, సిబ్బంది

పెద్దమండ్యం: మండలంలోని శిద్దవరం పంచాయతీ చింతమానువారిపల్లె సరిహద్దు అటవీ ప్రాంతాలలో ఆదివారం సాయంత్రం నాటుసారా తయారీ స్థావరాలపై పోలీసులు దాడులు చేశారు. దాడుల్లో 200 లీటర్ల నాటుసారా ఊట ధ్వంసం చేసినట్లు ఎస్‌ఐ పి. వెంకటరమణ తెలిపారు. ఎస్‌ఐ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. చింతమానువారిపల్లె సరిహద్దు అటవీ ప్రాంతంలో నాటుసారా తయారీ చేస్తున్నట్లు అందిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించినట్లు తెలిపారు. పెద్ద ఎత్తున డ్రమ్ములు, నీటి బిందెలలో నిలువ ఉంచిన నాటుసారా ఊటను గుర్తించి ధ్వంసం చేసినట్లు తెలిపారు. నాటుసారా తయారీ, విక్రయాలు చేసే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. హెచ్‌సీ పీజే ఖాన్, క్రిష్ణమూర్తి, మధు పాల్గొన్నారు.

దేశ భక్తి అందరికీ స్ఫూర్తి

రైల్వేకోడూరు అర్బన్ : స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డెర ఓబన్న దేశభక్తి అందరికీ స్ఫూర్తి కావాలని వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి పేర్కొన్నారు. చిట్వేలి రోడ్డులోని ఓబన్న విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓబన్న స్వాతంత్ర్య పోరాట చరిత్రలో నిలిచిపోయారన్నారు.

సమస్యల వసతి..!

- సమస్యల వలయంలో సంక్షేమ హాస్టళ్లు
- మరమ్మతులకు నోచుకోని భవనాలు
- తాగునీటికి కటకట
- విద్యార్థులకు తప్పని అవస్థలు

మదనపల్లె సిటీ: మదనపల్లె నియోజకవర్గంలోని వసతి గృహాలు సమస్యలకు నిలయాలుగా మారాయి. అసౌకర్యాలే నడుమే విద్యార్థులు చదువులను కొనసాగించాల్సి వస్తోంది. శిథిల భవనాలు, తాగునీటి కొరత దీర్ఘకాలింగా వేధిస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. కొన్నిచోట్ల మరుగుదొడ్లు, స్నానపు గదులను వినియోగించడం లేదు. కనీసం భవనాల మరమ్మతులు చేపట్టడం లేదు. మదనపల్లె పట్టణం ఎంఎల్‌ఎల్ ఆస్పత్రి వద్ద ఇంటిగ్రేటెడ్ హాస్టల్ ఉంది. భవనం బాగానే ఉన్నా అపరిశుభ్రం చోటు చేసుకుంది. స్థానిక నీరుగట్టువారిపల్లెలో గిరిజన సంక్షేమ బాలుర కాలేజీ హాస్టల్ అద్దె భవనంలో కొనసాగుతోంది. రేకుల షెడ్డులో విద్యార్థులు ఉన్నారు. బాత్‌రూములు, మరుగుదొడ్లు దుర్వాసన వెదజల్లుతున్నాయి. షెడ్డులో విద్యార్థులు ఉంటున్నారు.



గిరిజన బాలుర కాలేజీ హాస్టల్‌లో అపరిశుభ్రంగా ఉన్న బాత్‌రూములు

సమస్యలతో సతమతవుతున్న విద్యార్థులు

ఎస్సీ సంక్షేమ హాస్టళ్లు 5 ఉండగా ఇందులో ఎస్సీ బాలుర కాలేజీ హాస్టల్ అద్దెభవనంలో నడుస్తుంది. స్థానిక నక్కలదిన్నెలోని ఎస్‌సి బాలుర హాస్టల్ భవనం పెచ్చులూడుతుంది. వర్షం వస్తే భవనం మొత్తం తడిసిపోతుంది. బాత్‌రూములు, మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉన్నాయి. నీటి సమస్య కారణంగా ట్యాంకర్లతో నీటిని సంప్‌లకు నింపుతున్నారు. దీంతో నీరు నిల్వ ఉండటం, సంప్‌లు శుభ్రం చేయకపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో పాటు ఎస్సీ బాలుర కాలేజీ హాస్టల్ అద్దె భవనం కావడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బీసీ సంక్షేమ వసతి గృహాలు 5 ఉండగా స్థానిక ప్రశాంత్‌నగర్‌లోని బీసీ బాలుర హాస్టల్ అద్దెభవనంలో నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు సరిపడ గదులు లేవు. భవనం పాతది కావడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. నక్కలదిన్నెలోని బీసీ బాలుర కాలేజీ హాస్టల్ అద్దెభవనంలో నడుస్తుంది. రేకుల గదులతో విద్యార్థులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. నక్కలదిన్నెలోని బీసీ బాలుర హాస్టల్ పై ఫ్లోర్ పెలకలు ఊడటంతో వర్షం వస్తే చాలు నీటితో నిండిపోతోంది. దీంతో పైఫ్లోర్ పూర్తిగా మూసివేశారు. రామసముద్రం మండలంలో బీసీ బాలుర హాస్టల్‌లో సమస్యలు తాండవిస్తున్నాయి. ఎస్టీ బాలిక హాస్టల్‌లో విద్యార్థినులు సాయంత్రం భోజనం చేసిన తరువాత ఇళ్లకు వెళ్లిపోతున్నారు.



దుర్వాసన వెదజల్లుతున్న ఎస్సీ బాలుర (నక్కలదిన్నె) హాస్టల్ బాత్‌రూం

హాస్టల్‌లో సమస్యలు పరిష్కరించాలి



హాస్టల్‌లో సమస్యలు పరిష్కరించాలి. విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గిరిజన కాలేజీ హాస్టల్, బీసీ కాలేజీ హాస్టల్ అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. కొన్ని భవనాల్లో మరమ్మతులు చేయాలి. నాణ్యమైన భోజనం అందించాలి. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

–మాధవ్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి

అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తాం

విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలి. హాస్టల్ సమస్యలు అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తాం. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం. విద్యార్థులకు వసతులు కల్పించేందుకు కృషి చేస్తాం.

–శ్రీరాములు, ఏఎస్‌డబ్ల్యూఓ, మదనపల్లె

మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట

ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె : నియోజకవర్గవ్యాప్తంగా ప్రజలకు అవసరమైన మౌలికవసతుల కల్పనకు పెద్దపీట వేస్తూ, ప్రజాసమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. ఆదివారం మండలంలోని కోళ్లబైలు పంచాయతీ బాబూకాలనీ జామతోట ప్రాంతంలో పర్యటించారు. ప్రజాసమస్యలపై ఏర్పాటుచేసిన గ్రామసభలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా స్థానికులు రోడ్లు, డ్రైనేజీ కాలువలు, వీధిదీపాలు లేవని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. దీంతో స్పందించిన ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి, ప్రజలు కోరిన వసతులపై నివేదికలు సిద్ధం చేయాలని, పరిష్కరించదగిన చిన్నచిన్న సమస్యలను 15 రోజుల్లోపు పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం పట్టణంలోని ఇందిరానగర్‌లో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఆర్వో మినరల్ వాటర్‌ప్లాంట్‌ను ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల తాగునీటి అవసరాలు తీర్చేందుకు నియోజకవర్గంలో మున్సిపల్, గ్రామపంచాయతీల ఆధ్వర్యంలో అన్ని వార్డుల్లో, గ్రామాల్లో విస్తృతంగా ఆర్వో ప్లాంట్లు ఏర్పాటుచేసి, ప్రజలకు సురక్షిత మంచినీటిని అందిస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కే.ప్రమీల, ఇందిరానగర్ ప్రజలు పాల్గొన్నారు.



ఇందిరానగర్‌లో ఆర్వో ప్లాంటును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

జీఎన్‌ఎం శిక్షణ పూర్తి



సన్మానం పొందిన ఏఎన్‌ఎంలు

పీలేరు రూరల్ : 25 మంది ఏఎన్‌ఎంలు స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో జీఎన్‌ఎం శిక్షణ పూర్తి చేసినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం శిక్షణ పూర్తి చేసుకున్న ఏఎన్‌ఎంలను జ్ఞాపికలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ ప్రాంతాల 25 మంది ఏఎన్‌ఎంలు స్థానిక ఏరియా ఆస్పత్రిగా రెండు సంవత్సరాలుగా జీఎన్‌ఎం శిక్షణ పొందడంతో పాటు రోగులకు సేవలందించారని అభినందించారు. శిక్షణ పూర్తి చేసుకున్న ఏఎన్‌ఎంలను రిలీవ్ చేసినట్లు తెలిపారు. డాక్టర్ ఈశ్వరసురేంద్ర, డాక్టర్ నాగేవణి, డాక్టర్ శ్రీలత పాల్గొన్నారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

మదనపల్లె : రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ అనుబంధం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జె.రామచంద్రయ్య డిమాండ్ చేశారు. ఆదివారం మదనపల్లె మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ సమావేశం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో మస్తాన్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రామచంద్రయ్య మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల తరబడి మున్సిపల్, కార్పొరేషన్‌లలో పనిచేస్తున్న శానిటేషన్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ వర్కర్స్‌ను రెగ్యులరైజ్ చేయకుండా శ్రమదోపిడీకి పాల్పడుతున్నారని తెలిపారు. కనీసవేతనం రూ.26వేలు ఇవ్వాలని, కరోనా సమయంలో తీసుకున్న దినసరివేతన కూలీలను ఆప్కాస్‌లో చేర్చి ఔట్‌సోర్సింగ్ వర్కర్స్‌కు వస్తున్న వేతనాలు, ఇతర సౌకర్యాలు డెయిలీ వేజెస్ కార్మికులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సీనియర్ నాయకుడు మస్తాన్, జిల్లా కార్యదర్శి సురేష్ కుమార్, ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి తిరుమల, దేవా, నాగరాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జె.రామచంద్రయ్య

నూతన కమిటీ ఎన్నిక

మున్సిపల్ పారిశుద్ధ్య ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడుగా సురేష్‌కుమార్, ఉపాధ్యక్షుడుగా పృథ్వీరాజ్, ప్రధాన కార్యదర్శిగా నాగరాజు, సహాయ కార్యదర్శిగా ముబారక్, కోశాధికారిగా ఇంద్రాణితో పాటు 25 మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

నమోస్తుతే.. జగన్మాత

- వైభవంగా శరన్నవరాత్రుల ఉత్సవాలు
- భక్తులతో కిటకిటలాడుతున్న ఆలయాలు
- బహురూపాల్లో దర్శన మిచ్చిన అమ్మవార్లు



మదనపల్లె సిటీ: లలితాదేవి అలంకారంలో వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు



బి.కొత్తకోట: లలితాదేవి అలంకరణలో కన్యకాపరమేశ్వరి



కలికిరి: లలితా త్రిపురసుందరీ దేవిగా దర్శనమిస్తున్న ఎల్లమ్మతల్లి

మదనపల్లె సిటీ: దసరా శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా ఆదివారం మదనపల్లె పట్టణంలోని అమ్మవారి ఆలయాల్లో అమ్మవార్లు బహురూపాల్లో భక్తులు దర్శనమిచ్చారు. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్థానిక వాసవీభవన్‌వీధిలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారు లలితాదేవి అలంకారంలో భక్తులకు ఆకట్టుంది. స్థానిక నీరుగట్టువారిపల్లెలోని చౌడేశ్వరి ఆలయంలో అమ్మవారు వెండి కవచం అలంకారంలో భక్తులకు దర్శనం కల్పించారు. స్థానిక దేవళంవీధిలోని సోమేశ్వరస్వామి ఆలయంలో శ్రీలలితాత్రిపుర సుందరిదేవి అమ్మవారు మహాలక్ష్మిదేవి అలంకారంలో భక్తులకు దర్శనం కల్పించారు. అలాగే సీటీఎం రోడ్డులోని రాజరాజేశ్వరి ఆలయం, యోగభోగేశ్వర స్వామి ఆలయం, భువనేశ్వరి ఆలయాల్లో అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణలు చేశారు.

లలితాదేవి అలంకరణలో..

బి.కొత్తకోట: దసరా ఉత్సవాల్లో భాగంగా స్థానిక కన్యకా పరమేశ్వరీ ఆదివారం రాత్రి లలితాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేకంగా పూలతో ఆలంకరించారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు.

లలితా త్రిపురసుందరీ దేవిగా ఎల్లమ్మతల్లి

కలికిరి: దసరా నవరాత్రి ఉత్సవాలలో భాగంగా కలికిరి గ్రామదేవత ఎల్లమ్మతల్లి ఆదివారం శ్రీలలితా త్రిపురసుందరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఉదయం అమ్మవారికి అర్చన, అభిషేకం, విశేష పూజా కార్యక్రమాలు చేశారు. పట్టణంలోని సోమేశ్వరస్వామి ఆలయంలో ఏర్పాటు చేసి దుర్గాదేవికి పూజలు నిర్వహించి, సాయంత్రం లలితసహస్ర నామ కుంకుమార్చన చేశారు. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి దసరా ఉత్సవాలలో భాగంగా ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించారు.

వారాహి అలంకరణలో అమ్మవారు

వాల్మీకిపురం: దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్థానిక శ్రీ నల్లవీరగంగాభవాని అమ్మవారి ఆలయంలో గంగాభవాని అమ్మవారు వారాహి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే స్థానిక శ్రీ లక్ష్మీకామేశ్వరస్వామి ఆలయంలో కామేశ్వరి అమ్మవారు అన్నపూర్ణాదేవి, వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవి ఆలయంలో మూకాంబికాదేవి, గండబోయనపల్లిలోని సత్యమ్మ తల్లి లలితా త్రిపుర సుందరీదేవిగా, గొళ్లపల్లిలోని విరూపాక్షమ్మ అమ్మవారు లలితా త్రిపుర సుందరీదేవిగా, చింతపర్తిలోని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు దుర్గమ్మ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవార్లను ఉదయం సుప్రభాత సేవతో మేల్కొలిపి అర్చన, అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. అలాగే మండలంలోని జర్రావారిపల్లిలో గ్రామదేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పూజార్లు జనార్దన్, ఉత్తన్న, వరదరాజు, అర్చకులు శీనాస్వామి, సుదీర్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

మోహినీ అలంకరణలో కన్యకాపరమేశ్వరి

పీలేరు : శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు మోహినీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే ఆదివారం స్థానిక మోడల్ కాలనీలోని యల్లమ్మతల్లి ఆలయంలో అమ్మవారికి లలితాదేవి అలంకరణ, పూజలు నిర్వహించారు. స్థానిక ప్రభుత్వాస్పత్రి ఆవరణలోని రౌద్రాల అంకాలమ్మ అమ్మవారికి అభిషేకం నిర్వహించి అన్నపూర్ణాదేవి అలంకరణ చేశారు. విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

లలితాదేవి అలంకరణలో చౌడేశ్వరిదేవి

కేవీపల్లె : మండలంలోని చీనేపలెల్లో వెలసిన శ్రీ రామలింగ చౌడేశ్వరి అమ్మవారు లలితాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. దసరా ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ చేశారు. అమ్మవారికి దర్శించుకున్న భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అలాగే గర్నిమిట్ట యల్లమ్మ అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, విశేష పూజలు నిర్వహించారు.



వాల్మీకిపురం: లలితా త్రిపుర సుందరి అలంకరణలో దర్శనమిస్తున్న సత్యమ్మ తల్లి



పీలేరు : మోహినీ అలంకరణలో కన్యకాపరమేశ్వరి



కేవీపల్లె : లలితాదేవి అలంకరణలో చౌడేశ్వరిదేవి

సమగ్ర సంక్షేమ చట్టం తీసుకురావాలి

బి.కొత్తకోట: రాష్ట్రంలోని 27 లక్షల మంది హమాలీ కార్మికుల కోసం సమగ్ర సంక్షేమ చట్టం తీసుకురావాలని ఆ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్‌డీ.రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం బి.కొత్తకోటలో హమాలీ కార్మికుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేరళ, తమిళనాడు తరహాలో రాష్ట్రంలో కార్మిక సంక్షేమ చట్టం చేయాలని కోరారు. చట్టం అమలు చేస్తే కార్మికులకు వైద్యం, పింఛన్, పక్కా గృహాలు, పిల్లల చదువులకు ఆర్థిక సహకారం, రేషన్‌కార్డుల మంజూరు జరుగుతుందన్నారు. కార్మికుల కడుపుకొడుతున్న కేంద్ర ప్రభుత్వం, కార్పొరేట్ సంస్థలకు వేల కోట్లు దోచిపెడుతోందని విమర్శించారు. హక్కులు, సౌకర్యాల కోసం కార్మికులు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎ.బాబు, ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, రఘునాథ్, తంబయ్యశెట్టి, గంగులప్ప, అమీర్ పాల్గొన్నారు.

జరిమానా

సుండుపల్లె : మండల పోలీస్ స్టేషన్ పరిధిలో తన సిబ్బందితో కలిసి తనిఖీలు చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు మద్యం తాగి పట్టుబడ్డారని ఎస్‌ఐ ఎం.శ్రీనివాసులు తెలిపారు. రాయచోటి స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో ఇద్దరినీ హాజరు పరచగా మెజిస్ట్రేట్ ఒక్కొక్కరికి రూ.10500లు జరిమానా విధించినట్లు తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

తవ్వారు.. వదిలేశారు..!

- ఝురికోన పైపులైను ధ్వంసం
- బీఎస్‌ఎన్‌ఎల్ కాంట్రాక్టరు నిర్వాకం

కలికిరి: మండల పరిధిలోని గుట్టపాళెం గ్రామ పరిధిలోని కలికిరి నుంచి సోమల వెళ్లే రహదారిలో యల్లంపల్లి వద్ద సుమారు ఒక పర్లాంగ్ దూరం రోడ్డు పక్కన బీఎస్‌ఎన్‌ఎల్ కాంట్రాక్టర్ కేబుల్ ఏర్పాటు కోసం ఏడాది క్రితం తవ్వేశారు. పనులు చేస్తున్న సమయంలో ఝురికోన పైపులైను ధ్వంసమైంది. దీంతో గుట్టపాళెం పంచాయతీ పరిధిలోని వాడవాండ్లపల్లి, కుమ్మరపల్లి, యల్లంపల్లి, వైకేపల్లి, సామకుంటవారిపల్లి తదితర గ్రామాల ప్రజలు నీటికి ఇబ్బంది పడుతారని సర్పంచ్ వెంకటరెడ్డి తెలిపారు. అప్పట్లో ఝురికోన పైపులైన్ మరమ్మతులు పనులు చేస్తామని కాంట్రాక్టర్ హామీ ఇచ్చారు. ఏడాదిగా సంబంధిత కాంట్రాక్టరుగానీ, బీఎస్‌ఎన్‌ఎల్ అధికారులుగానీ అటువైపు చూడలేదు. చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు ఫిర్యాదు చేసినా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే కలికిరి నుంచి సోమల వైపు వెళ్లే వాహనదారులు తవ్వకాలు జరిగిన ప్రాంతంలో రోడ్డు ఇరుకుగా ఉండటంతో తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. దీనిపై సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేయాలని వాహనదారులు, గుట్టపాళెం గ్రామస్తులు కోరుతున్నారు.



తాగునీటి పైప్‌లైన్ కోసం తవ్వేసి వదిలేయడంతో ప్రమాదకరంగా మారిన రోడ్డు

బాధ్యతల స్వీకరణ

లక్కిరెడ్డిపల్లి: ప్రైవేటు మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకోవాలని ఎక్సైజ్ సీఐ హిమబిందు పేర్కొన్నారు. లక్కిరెడ్డిపల్లి ఎక్సైజ్ కార్యాలయంలో ఆదివారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ లక్కిరెడ్డిపల్లి ఎక్సైజ్ పరిధిలోని రెండు, రామాపురం మండలంలో రెండు, గాలివీడులో మూడు దుకాణాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

రక్తం ఇవ్వండి... ప్రాణాలు కాపాడండి

లక్కిరెడ్డిపల్లి : ప్రతి ఒక్కరూ రక్త దానం చేసి మరొకరి ప్రాణాలు కాపాడాలని లక్కిరెడ్డిపల్లి హెల్పింగ్ బ్లడ్ క్యాంప్ సంస్థ సభ్యులు సలీమ్, మునీర్, ముజాహిద్, ఇంతియాజ్‌పేర్కొన్నారు. మండలంలోని జెడ్పీ బాలుకోన్నత పాఠశాలలో ఆదివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు.